కథ

# ఎవడితోనైనా లేచిపోరాదూ?

## అవసరాల రామకృష్ణారావు

జానకీ,

నిన్నరాత్రి ఒక్క మారైనా నిద్ర పట్టలేదు నీఉత్తరం చూసి. నిజానికి నిన్న ఒక్క రాత్రే కాదు, ఎన్నో రోజుల తరబడి ఆలోచిస్తున్నాను నీ గురించి, ఏదో ఒక మార్గం చూపించాలని. నేనే ఆ పరిస్థితిలో ఉంటే ఏంచేస్తానా అని కొట్టుకు పోతున్నాను. ప్రాణ స్నేహితురాళ్ళమైన నువ్వూ నేనూ వేరు కాదుగనుక నాకు నేనే ఏదో ఒక జవాబు, మనసుకి నచ్చేలా నాటేలా చెప్పుకోవాలి. ఇది వరకు నేను నీకీ ఉత్తరంలో విషయాలు సూచనప్రాయంగా చెప్పక పోలేదు. కాని నిన్ను కలుసుకోగానే నీతో ఏం చెప్పాలో మరిచిపోయి తడబడి పోతాను. ప్రేమ గుడ్డిదయితే స్నేహం పిచ్చిది. నన్ను నేను అద్దంలో చూసుకున్నట్టు ఉంటుంది. పై పైన సవరించుకో గలను, గాని లోలోపల సంగతులు వివరించగలనా! అందుకనే నిన్ను కలుసుకోవడం మానేశాను. అద్దంచూడ్డం మానెయ్యవచ్చు గాని అంతర్ముఖం కాకుండా మనసుని అరికట్టడం అసాధ్యం అని తేలిపోయింది. నిన్నటి నీ ఉత్తరం చూడగానే- నీకుఉత్తరం కూడా రాయడం మానేసిన నా పట్టుదల ఒక్కమారు పటాపంచలయింది. నిన్ను కలుసుకుని నీమొహం చూస్తూ, నిజానిజాలు చర్చించలేను. అభిమానానికీ, మొహమాటానికీ తావు ఇవ్వక యీ ఉత్తరంలో నయినా నామనసుని పూర్తిగా నిష్కర్షగా చెప్పగలిగే శక్తి యిమ్మని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ యీ జవాబు మొదలు పెడుతున్నాను.

సగం భాగం నే నిక్కడ ఉన్నాను గాని, నిన్న రాత్రికి మిగిలిన సగమూ, ఎవరిది, మీ బావగారిది క్యాంపులో వుంది. మాఅబ్బాయి శరీరమయితే ఉయ్యాల్లో కనిపిస్తోంది గాని ఏస్వప్న సీమలోనో విహరిస్తోంది ఆ పసి హృదయం. ఒంటరిగా ఉన్నట్టునేను పైకి కనిపిస్తున్నానుగాని నీఉత్తరం తోపాటు నీ పాత ఉత్తరాలకట్ట- నాఎదురుగుండా టేబిలు మీద ఉన్నది. నాతో మాట్లాడుతున్నట్లె వుంది. అందులో నామనసుకి బాగా పట్టిపోయిన నీ పాత ఉత్తరాలుమూడు నీకు నువ్వుగా వచ్చి నాతో చెప్పుకున్నట్లె అనిపించింది.

అందులో మళ్ళీ కొన్ని ముఖ్యమయిన సంగతులు రిఫర్ చేస్తున్నాను. ఎందుకలా చెయ్య వలసి వచ్చిందో చివరి దాకా చదివితే నీకే తెలుస్తుందని నా నమ్మకం.

నీ బియ్యే రిజల్ట్సు గురించి రాసింది అందులో మొదటిది.

నిజంగా ఈ పరిక్షా ఫలితాల గురించి నేనెంత కొట్టుకు పోయానో ఆభగవంతుడికే తెలియాలి సావిత్రీ! మా కుటుంబ పరిస్థితులు నీకు తెలియనివి కావు. మా అన్నయ్య యింటికి పెద్దయినా మొదటిన్నించీ మాబాధ్యతలు మాకు వదిలిపెట్టి వాళ్ళ మామగారి పూచీ అంతా మీద పెట్టుకున్నాడు. అక్కయ్యా దాని కాపురమూ సరేసరి. ఇవతలి వాళ్ళు చస్తున్నా ఒకపూటయినా వాళ్ళ వాళ్ళు పుట్టింటికి పంపరు. ఇక యింట్లో మిగిలింది నేనూ, యిద్దరు చెల్లెళ్ళూ, తమ్ముడూను- అమ్మా నాన్నా మా యిద్దరి మేనత్తలూనూ. తర్వాత తీర్చేద్దాం కదా అని అక్కయ్య పెళ్ళికి నాన్నగారు బ్యాంకులో తీసుకుని వాడుకున్న సొమ్ము తిరిగి తీర్చలేక ఆయన ఉద్యోగమే ఊడింది. దాన్తో మనస్సు చెదిరి ఆయన ఆరోగ్యం బాగా దెబ్బతింది. ఈ హడావిడిలో ఎలా చదివేనో ఎలా పరీక్షలు రాసేనో నాకే తెలీదు. ఇంచుమించు రాత్రి తెల్లవార్లూ నాన్నగారు దగ్గుతూనే వుండేవారు. రక్త పరీక్ష చేసి డాక్టరు ఫలితం చెప్పిననాడు మాకెవరికీ మతుల్లేవు. ఉన్న వాళ్ళలో నేనూ, మారెండో చెల్లీ కొంచెం నయం. మిగిలినవాళ్ళని పట్టుకోవడం బ్రహ్మ తరమైంది కాదు. 'ఇప్పుడు ఈ జబ్బు కుదరని వ్యాధేం కాదు. మనమేం అదుక్కుతినడం లేదు. మీరేం కంగారుపడకండి' అని నాన్నకు చెప్పేను. అమ్మ గొలుసు అమ్మేసి శానిటోరియంలో జాయిన్ చేయించాము. నాన్న కుడిచెయ్యి తీసుకుని నా గుండెలమీద పెట్టుకుని 'నాన్నో, నేను నీకున్నాను' అని ధైర్యంగా చెప్పగలిగాను. మళ్ళీ డాక్టరు పరీక్షచేసి చెప్పేడు వ్యాధిమళ్ళుతోందని సరిగ్గా ఈ సంధర్భం లోనే మాఫలితాలు తెలిశాయి. నేను ప్యాసయ్యాను. నేనిప్పుడు గ్రాడ్యుయేట్ని సావిత్రీ! నెలకి ఓ నూరు రూపాయల ఉద్యోగం దొరికినా చాలు. మరీ యిన్ని అప్పులూ యింత చికాకూ ఉండదు. ఆకబురు విని నాన్న గారు ఆనంద బాష్పాలు రాలుస్తూ నా రెండు చేతులూ పట్టుకున్నారు. అప్పుడు ఆయన నా తండ్రి అనిపించలేదు నా కొడుకు అనిపించింది".

ఇలా ఇలా సాగింది ఆ ఉత్తరం. నేనప్పుడు నీకేమీ జవాబు రాశానో ప్రతిముక్కా చెప్పలేను గాని, మీ ఆర్థిక బాధలు తీరిపోయి, మీ నాన్న గారికి మామూలు ఆరోగ్యం క్రమంగా

చేకూరాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను" అనే భావం వ్యక్తీకరించి వుంటాను.

ఆ తరువాత దసరాముందు అనుకుంటాను మనం కలుసుకున్నాం. అప్పుడు చెప్పేవు ఎంత ప్రయత్నించినా ఎక్కడా ఉద్యోగం దొరకలేదనీ- ఎంతో ప్రయత్నంమీద బియ్యేడీలో సీటు దొరికిందనీ... ఆసందర్భంలోనే నిన్ను అడిగినట్టు జ్ఞాపకం;

"అన్నీ బాగానే ఉన్నాయి, నీ పెళ్ళిమాట?".

ఇప్పుడా ప్రసక్తిఎత్తడానికి నీకు మనసెలా వచ్చింది.

సావిత్రీ! నాన్నగారికి తిరగ బెట్టింది కదా అని యింటిల్లిపాదీ మతులేకుండా ఏడుస్తూవుంటే..."

నేను నాలిక కరుచుకున్నాను. అప్పుడలా నాలుక కరుచుకున్నందుకు ఇప్పుడు లెంప వాయించుకుంటున్నాను....

సరే మేం యీ వూరు వచ్చిన కొత్తలో నీనుంచి వచ్చిన వుత్తరం సంగతి.

"సావిత్రీ, యీ దారుణమైన వార్త నీచెవిని ఎలా వెయ్యడమో నాకు తెలియడంలేదు. ఇంత మందిమీ ఉండి కూడా నాన్నగారిని దక్కించుకోలేక పోయాము మేము. అన్నయ్యా ,వదినా వచ్చారు, నాన్న గారికి ఏకర్మ చెయ్యడానికైనా కర్తృత్వం వాడిదేట. ఏవేవో చేస్తున్నారు. వదిన వచ్చిందగ్గర్నుంచీ 'యీ ఇల్లు ఎవరి పేర రాశారో !' అని వాకబు చెయ్యడం మొదలు పెట్టింది. అన్నయ్య వదినని మందలించకపోవడం చూసినా ఒళ్ళు మండిపోయింది. వాణ్ణి వేరే పిలిచి గట్టిగా నాలుగూ అనేశాను. 'ఇంటిపెత్తనం మొదట్నుంచీ నువ్వే మీద వేసుకున్నావు. ఈ యింటి మంచీ చెడ్డా అంతా నువ్వే అనుభవించు. మధ్యని నాకేం?' అన్నాడు. అవును ఇంటికి పెద్ద అయినవాడు గాజులు తొడుక్కుని కూచుంటే నాలాంటి ఆడకూతుళ్ళు పెత్తనం వహించక చేసే దేముంది !" అనుకున్నాను. ఏమనుకున్నారో ఏమో మళ్ళీ ఆవూసు ఎత్తలేదు వాళ్ళు. అన్నీ అయిపోయాక ఎక్కడివాళ్ళు అక్కడికి వెళ్ళి పోయారు. అక్కయ్య సరే నాలుగో రోజునే వెళ్ళిపోయింది. ఇంట్లో ఎందరున్నా నాన్నలేక బావురు మంటున్నట్టుంది. ఇంకా ఎక్కణ్ణుంచో నాన్న గారు "పాపా బావున్నావా అమ్మా!" అని నన్ను పలకరిస్తున్నట్టే ఉంటుంది.

ఈ నీ మూడోఉత్తరం, పైన డేటు చూస్తే, తర్వాత ఏడాదిన్నరకి రాసినట్టు తెలుస్తోంది. అప్పటికి నీ బియ్యేడి అయిపోయి సైన్సు అసిస్టెంటుగా మునిసిపల్ గరల్సు స్కూలులో చేరి నాలుగు నెలలయిందనుకుంటాను. మీ పెద్ద చెల్లికి చదువబ్బక ఫిఫ్త్ ఫారంతోనే విరమించిందనీ, మీ రెండో చెల్లీ, తమ్ముడూ కాలేజీలో చదువుకుంటున్నారనీ అంతకు ముందే తెలియబరచావు.

"జానకి , ఏ నెలకానెల గడించి పారేస్తూ యిల్లు నడుపుతూ ఉంటే మీవాళ్ళకి చీమ కుట్టినట్టయినా లేదాయేం, నీ పెళ్ళి ఊసు వాళ్ళే ఎత్తరా, లేకపోతే నువ్వు నాకు రాయవా? నా కంటే నాలుగేళ్ళు పెద్ద నువ్వు. నా పెళ్ళయి ఈ శ్రావణానికి మూడేళ్ళూ వెడతాయి. ఈ విషయం మరచి పోక నీపెళ్ళి విషయంలో నీ అభిప్రాయం వెంటనే రాయి" అని ఆ రోజుల్లోనే ఎప్పుడో ఒకసారి నేను నీకు గట్టిగా రాశాను.

నా పెళ్ళి గురించి నన్నేం రాయమన్నావు సావిత్రీ! నిజం చెప్పాలంటే నాగురించి నాకు ఆలోచించడానికే తీరుబడిలేదు. ఇంట్లో ఏడుగురు పెద్దవాళ్ళకి గడవాలి. సంపాదించే దాన్ని నేను ఒక్కర్తనే, చెల్లి, తమ్ముడూ కాలేజీ చదువులు కూడానూ. నాన్నగారు పోయిందగ్గర్నుంచీ అమ్మ పరిస్థితి చూస్తుంటే రోజు రోజుకీ బెంగడిపోతుంది. ఇక మా మేనత్తలు బాగా పెద్దవాళ్ళయి పోయారు. ఇంట్లో ఏ వస్తువు కావాలన్నా నేనే చూసుకోవాలి. పది మొదలు ఐదు వరకూ స్కూలు .అంతకు ముందూ ఆ తర్వాత ట్యూషన్ను. పాపం పెద్దచెల్లి రెండు పూటలా యింత కాచిపోస్తోంది గాని లేకపోతే ఆ బాధ్యతా నామీదే పడునేమో... ఈ పరిస్థితిలో ఎలా గుండె రాయి చేసుకుని నా సుఖం నన్ను నిర్మించుకో మంటావు? అయినా మా మేనత్తలు ఏరోజు కారోజు నాకు పెళ్ళి వయసు దాటిపోతుందని గోలపెట్టక మానలేదు. నీ వెనక ఇంకా యిద్దరు ఎదిగి కూచ్చున్నారు- నువ్వే కాదంటే ఎలా?' అని మా అమ్మ తన ప్రయత్నాలు తను మానలేదు. నన్నడిగితే ఎలాగా వద్దంటానని, నాకు తెలియకుండానే మా మామయ్యకు రాసి భోగట్టాలు చేసేది మా అమ్మ. అయిదూ పదీ కట్నం సంఖ్య వినగానే అప్పుడే కళ్ళు తిరిగి వూరుకుంటుంది లెద్దూ అని నేనూ మాటాడలేదు.

ఆ సంధర్భంలో ఒక పెళ్ళి కొడుకు మామయ్య ఎడ్రసు యిచ్చేడుట... ఓ రోజు మిట్టమధ్యాహ్నం మా యింటికి వచ్చాడు. మాఅమ్మా వాళ్ళూ ఎవరింటోనో పురాణం చెప్తున్నారంటే వెళ్ళేరు. చెల్లీ, తమ్ముడూ సాయంకాలంగాని రారు. నేనూ పెద్దచెల్లీ యింట్లో వున్నాం. ఆరోగ్యంగా ఉండి వయస్సులో వున్న నాకు అంతవరకూ ఎలాంటి వాసనలూ సోకలేదని గట్టిగా చెప్పలేను.కాని ఆ కాస్సేపటిలో అతని కబుర్లూ బుద్ధులూ చూస్తుంటే 'ఇతను నా పార్ట్నరుగా వుంటేనా?' అని అనిపించకపోలేదు. ఇంత బరువునూ ఒక్క దాన్ని మొయ్యలేక గిలగిల కొట్టుకుంటున్నాను. నన్ను సానుభూతితో అర్థంచేసుకునే వ్యక్తి లభించడంకంటె నేను కోరుకోదగ్గది ఏముంటుంది!

అమ్మ, తమ్ముడు, చెల్లెలు యింత బాధ్యతని ఎవరు మాత్రం ఒక చేత్తో యీదుకు రాగలరు!'

అని అంటున్న ఆయన హృదయంలో పరమాత్ముడున్నాడనిపించింది.

"మీరూ, నేనూ సంపాదిస్తే అంత కష్టమనిపించదు!"

అని ఆయన అంటూంటే వేరే స్వర్గమెక్కడ అనిపించింది.

నాకే అభ్యంతరమూ లేదని చెప్పడానికి రడీగా ఉన్నాను.

ఇక్కడ మీరు రిజైన్ చేస్తే అక్కడ నేను ట్రై చేస్తాను. లేదా మీరక్కడికి ట్రాన్సుర్ చేయించుకోగలుగుతే ఏ ఇబ్బందీ లేదు." అన్నాడాయన. నా కాలికింద భూమి జరిగినట్టయింది.

"ఎక్కడికీ?" అన్నాను వణుకుతూ.

మా వూరికి. మా అమ్మా, తమ్ముడూ, చెల్లెలు అక్కడేగదా ఉంట! మీరక్కడికి వచ్చేస్తే ఇక ఏ బాధా ఉండదు మనకి!"

తల గిర్రున తిరిగినట్టయింది. మతిలేని దాన్లా గదిలోకి పరిగెత్తేను.

రెండు నిమిషాలు పోయాక మా పెద్దచెల్లి వచ్చింది.

"ఇంక అరగంటకి బస్సు ఉందిట. అమ్మా వాళ్ళూ ఎప్పుడొస్తారని ఆయన అడుగుతున్నారు. అయినా ఉన్నట్టుండి అలా వచ్చాశావేమిటి? ఏం బాగుంటుంది? ఆయనకేం తక్కువైందనీ?"

"నాకేం తక్కువైంది. నాకీ సంబంధం అక్కర్లేదు. ఆయన్ని వెళ్ళమను"

నీకు అక్కర్లేక పోవచ్చు, కాని..."

ఆయన ఒక్కరికీ కావలసినంత మాత్రాన యిదెలా చెల్లుతుంది?"

"అది కాదు... మరి..."

"ఏమిటీ, ఎవ్వుడూ లేని యీ నసుగుడూ?"

మీ కెవరికీ అభ్యంతరం లేకపోతే నేనే ఆయన్ని చేసుకుందామనీ!" నానోట మాట రాలేదు! ఎల్లవేలలా ఇంట్లో ఉండివంటపని చక్కబెట్టేది, ఏమాత్రమూ పెద్దచదువులు ఎరగన్ది ఎంత సుళువుగా సూటిగా తన అభిప్రాయం వెలిబుచ్చిందీ? ఇందులో నా అభ్యంతరానికేముంది. నేనేం దాని గార్డియన్నా?

మా మేనత్తలు పెద్దదానికవకుండా రెండో

దానికి వల్లకాదని కొట్టి పారేశారుగాని మాఅమ్మ ఒకర్తికయినా చాలనుకున్నట్టుంది; చిన్న చెల్లిచేత మామయ్యకి రాయించింది.

రెండో అమ్మాయి పెద్దమ్మాయికంటె రంగు గానూ కళగానూ ఉన్నమాటనిజమే .... కాని నేను ఆశపడింది ఆఅమ్మాయి జీతంచూసికద! లేకపోతే అంతకంతకి కట్నం రాబట్టుకోక పోదునా? అన్నాట్ట పెళ్ళికొడుకు.

"పోనీ ఎంత కావాలో చెప్పండి" అని మామయ్య కిందామీదాపెట్టి ఆఖరికి నాలుగువేలకి రైటుచేశాట్ట.

"చాలా మంచి సంబంధం... ఇంటిమీద అప్పు పుట్టకపోదు.... ప్రయత్నించండి" అని సలహా కూడా జోడించాడు మామయ్య.

"ఇంకా ఏ పది వేలు దాకా దేకుతాడో అని బెంగ పెట్టుకున్నాను కుర్రాడు ఏ విధంగా చూసినా బుద్ధిమంతుడిలా ఉన్నాడు!" అని మా అమ్మ అంటుంటే కారాలూ మిరియాలూ రాసుకున్నట్ట యింది నాకు.

అంతలా డబ్బుమొహం చూసుకున్న వాడుమనిషెలా అనిపించుకుంటాడు చెప్పు సావిత్రీ! అయినా యింట్లో వాళ్ళు నామాట వింటేనా ? మామయ్య వచ్చి యిల్లు తనఖా పెట్టడానికి ప్రయత్నాలు చేశాడు. దాని అన్నయ్య సంతకం కావలసి వచ్చింది. 'మాబాగా కుదిరింది వీళ్ళరోగం' అనుకున్నాను నేను. కాని ఉత్తరం అందీ అందగానే అన్నయ్య రావడం చూసి నా ఆశ్చర్యానికంతులేక పోయింది.

"జానకి ముదిరిపోయిందని కోడలూ నేనూ దుఃఖ పడని రోజు లేదనుకో అమ్మా! దీనికయినా సంబంధం జతపడితే అంతకంటె కావలసిందేముంది! ఇల్లు తనకా విషయంలో నేనేదో అడ్డుపుల్ల వేస్తానని ఎవరు చెప్పేరంట మీకు?"

అంటూ నా మొహం వైపు చూశాడు. నేను కోపంగా అటు తిప్పుకున్నాను. వెంటనే సంతకం పెట్టేశాడు అన్నయ్య. పెద్దచెల్లి అన్నయ్యని ఎంతగా పొగిడేసిందో చెప్పలేము. ఇన్నాళ్ళి నేను చేస్తున్నది ఎవరి కంటికీ ఆనలేదన్నమాట. ఆరాత్రి ఎవరెంత పిలిచినా భోజనానికి వెళ్ళలేదు నేను. అన్నట్టు అన్నయ్య పెద్దకొడుకు గోపిని కూడా వెంటబెట్టుకొచ్చేడు.

"వీణ్ణి యీ పెళ్ళయేదాకా యిక్కడ ఉంచెయ్యరాదుట్రా ?" అంది అమ్మ.

"పెళ్ళయేదాకాఏమిటి ఏకంగా యిక్కడ ఉంచెయ్యాలనేఉంది. అయితే ఇంట్లో అందరికీ అంగీకారం అవుతుందో అవదో"
అన్నాడు మళ్ళీ నా వైపు అదోలా చూస్తూ.

నేను విసవిస లాడుతూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాను.

"వాడికి చదువు అబ్బటంలేదే అమ్మా...ఇక్కడ జానకి దగ్గర వుంచేస్తే నాలుగు ముక్కలు వొంటబడతాయని ఆశ. మొదట్నుంచీ నేనెంత కలుపుకోవాలని చూసినా చచ్చేకోపం నామీదదానికి"

"చాల్లేరా. అదెందుకు వద్దంటుంది మధ్య?" అని అమ్మే చెప్పేసింది.

"వాడిభారం మీరేం మొయ్యక్కర్లేదు. ఏనెలకానెల పంపేస్తాను" అన్నాడు అన్నయ్య. అమ్మ గట్టిగా కోప్పడింది.

"మేమేమీ అడుక్కు తినడంలేదు... వేలెడు వెధవయింత తిండి పెట్టలేకపోము. నువ్వ లాంటి ప్రయత్నాలు చెయ్యడానికి వల్లగాదు" అంతే. అప్పట్నుంచీ గోపీ మా ఇంటో వుండిపోయాడు.

పెద్దచెల్లి పెళ్ళయిఅత్తారింటికి వెళ్ళి పోయింది. మా అక్కయ్య పెళ్ళికి వచ్చినప్పుడు గోపీ యిక్కడుండటం చూసింది. వాళ్ళ ఊళ్ళో మన భాష కాదుట. పెద్దబ్బాయి రవణను నాకు అప్పచెప్పి మరీ వెళ్ళింది!"

నేను ఎంచి పెట్టుకున్న నీ మూడో వుత్తరంలోని ముఖ్య విశేషాలు యివే అనుకుంటాను జానకీ!

నిన్న అందిన నీ ఉత్తరం వీటన్నిటిని తలదన్ని నదనుకుంటాను. ఇకనైనా నీకు గట్టిగా ఘాటుగా చెప్పవలసి ఉందని నాకు తోపింపజేసింది అదే.

మీ చిన్న మేనత్తకి మూడు నెలలై పక్షవాతం వచ్చి మంచంమీంచి లేవడంలేదని రాశావు.

పాపం ఎంత ముసలిదయినా ఏకాలపు దయినా నాగురించి కాస్త కనుక్కుని మంచీ చెడ్డా విచక్షణ చూపించేది. ఇంటిమొత్తంమీద ఆమె ఒక్కర్తే. ఇంట్లో ఎవరికీ అందకుండా ఎక్కడో దాచి స్టూల్నించి రాగానే ఫ్లాస్కులోంచి వేడివేడి కాఫీ యిచ్చేది నాకు మా చిన్నత్త మాత్రమే. ఆమె పడిపోయింది. నా సర్వస్వం కోలుపోయినట్ట యింది. అంత వయసులో ఆరోగం వస్తే ఇంక కుదరడం అంటూ ఉండదుట, కానీ మా చిన్నత్త దగ్గిర కూచోడానికి నాకు క్షణం తీరిక దొరకడం లేదు. మునుపయితే మా రెండోచెల్లి కొంచెమేనా పని సాయంచేసేది. ఇప్పుడు ముస్తాబు అవడానికే దానికి ముప్పొద్దులూ చాలడంలేదు. ఏమైనా అంటే 'ఖస్' మని లేస్తోంది. 'తనలా అందరూ సన్యాసుల్లో కలిసిపోలేదని అక్కయ్యకి దుఃఖం కాబోలు' అంది ఒకసారి నేను వింటుండగానే, నా గుండె

ప్రపంచ సాహిత్యంలో లేఖా సాహిత్యానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. సంప్రదాయ సాహిత్యంలోకంటే లేఖా సాహిత్యంలోనే గొప్ప కథలు వెలువడ్డాయి. సుమారు 35 సంవత్సరాల క్రితం జ్యోతి మాసపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో 'ఎవరితోనన్నా లేచిపోరాదు' అనే కథ ప్రచురితమై ఎందరినో కదిలించింది.

ఈ కదలికను ప్రేరణగా తీసుకొని 'ఎవరితో లేచిపోను' అనే కథ విద్యుల్లత మాసపత్రికలో ప్రచురితమైంది. యాదృచ్ఛికంగా ఒక లేఖ దానికి జవాబుగా ఈ రెండు కథలు రావడం ఆశ్చర్యంతోపాటు ఎంతో ఆనందాన్ని అందించాయి.

**మొదటి కథ రచయిత తెలుగు కథా సాహిత్యంలో అగ్రేసరులైన శ్రీ అవసరాల రామకృష్ణారావుగారు, రెండో కథ రచయిత శ్రీ కాటూరి రవీంద్ర త్రివిక్రమ్‌గారు. సుదీర్ఘ సాహిత్య యాత్ర చేస్తున్న వీళ్ళిద్దరూ లబ్ధప్రతిష్ఠులైన కథకులు.**

**ఈ రెండు కథలను చినుకు పాఠకులకోసం ప్రత్యేకంగా ప్రచురించడానికి అనుమతించినందుకు వారిద్దరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు.**

కలుక్కుమంది. ఒకసారి మా ఎదురింటావిడ పక్కింటావిడతో అంటోంది.

"వాళ్ళ జానకికి లోపల్లోపల ఏదో రోగం ఉందను కుంటాను. రోజురోజుకీ ఎలా ఆర్చుకు పోతోందో చూడరాదూ? ఓ నవకమా, చవకమా? లేకపోతే ఆ అమ్మాయి అలావుండగా తరవాతదానికి చేసుకుంటారారా? ఇప్పుడు ఆఖరమ్మాయికి సంబం ధాలు చూస్తున్నారుట"

పొరిగింటి ఆవిడ దృష్టిలో నేను రోగిష్టిదాన్ని అయ్యాను!

అన్నయ్య అభిప్రాయంలో "పాపం జానకి వయసు ముదిరిపోయింది!"

చిన్నచెల్లి నన్ను సన్యాసుల్లో కలిపేసింది! నాకు కోరికల్లేవా,నేను మనిషిని కానా?

ముప్ఫై రెండేళ్ళకే జానకి అన్నది చచ్చిపోయిందా!

నాన్నగారు తమ్ముడంటే ప్రాణం పెట్టేవారు. వాడుమా ఆరుగురిలో ఆఖరివాడని అందరికంటే అభిమానంగా చూసుకునిఏ పనీ చెప్పేదాన్నికాదు నేను. అలాంటిది వాడుకూడా నేనిప్పుడు పిలిస్తే పలకడంలేదు! ఎప్పుడెంత అడిగితే అంత ఇవ్వలేదని వాడికికోపం. నాదగ్గిర ఏం మిగులుతోందని వాడికివ్వను! ఇంక గోపీ రవణా సరేసరి, చిన్నచిన్న దొంగతనాలు కూడా మొదలు పెట్టేరు. ఏముక్క అన్నా ఆనిముషాన వాళ్ళఊరు పంపెయ్యమని పేచీ.

"వాళ్ళు దిక్కులేక మన వంచని చేరేరుటే?" అని అమ్మ వెన కేసుకురావడం... మనిషికి మనిషి తోడయితే యీ కరువు రోజుల్లో పెట్టడం మాటలా? ఒకరోజు కంట తడిపెట్టుకుని యివన్నీ చిన్నత్తతో చెప్పుకున్నాను. నన్ను ఓదార్చ దానికా అన్నట్టు ఆమె చెయ్యిఎత్తబోయింది. కాని మధ్యలోనే వెనక్కి విరుచుకు పడిపోయింది. ఈసారి వచ్చిన ఎటాక్ ఆమె అంతాన్ని చూసేసింది. అంతే.

సావిత్రీ, మాఊరు రావడం మానేశావు. నెల్లాళ్ళకయినా ఓ ఉత్తరం రాయడం మానేశావు. నేనుకూడా నీకేం అపకారం చేశాను? నాకు రోజు రోజుకీ పిచ్చెత్తేటట్టుంది ఎక్కడి కయినా పారిపోదామా ఎందులో అయినా పడి పోదామా అనిఉంది... నన్ను మొదట్నుంచీ అర్థం చేసుకున్నదానివి నువ్వొక్కర్తి వయినా యింకా మిగిలి ఉన్నావనే తృప్తి నాకు దక్కనీ. నా త్యాగాన్ని నువ్వొక్కర్తివయినాగుర్తించావనే మంచిమాట నన్ను విననీ.

నీ సర్వం నాకూ, నాతోబాటు నీకూ తెలిసిరాడానికి నీ పాత ఉత్తరాల్లోవీ కొన్ని ముఖ్యమైన సంగతులు మళ్ళీ యిందులో ఉదహరించడం జరిగింది.

"జానకీ, మీయింట్లో ప్రతి ఒక్కరు స్వార్థపరులు. ఈ వాక్యం మరోసారి చదివితే నువ్వు త్రుళ్ళి పడక తప్పదు. అవును. మీ యింట్లోప్రతి ఒక్కరు స్వార్థపరులు. నువ్వు కూడాను! మీ వాళ్ళందరికీ నీ డబ్బుకావాలి ప్రతి ఒక్కరికీ నువ్వు సంపాదించే మొత్తంలో అంతో ఇంతో కావాలి నీకు ప్రతి ఒక్కర్నుంచీ 'మంచిమాట' కావాలి.' జానకి ఎంత స్వార్థత్యాగి!' అనే పొగడ్త కావాలి. 'పాపం, మొదట్నుంచీ ఆ అమ్మాయి తన కోసమని ఏం చేసుకుని ఎరగదు. ఆడపిల్ల అయినా అంత బరువునీ స్వీకరించి ఆత్మార్పణ చేసుకుంది' అనే మన్నన కావాలి. ఇది నీకు అక్కర్లేదంటావా, గుండెమీద చెయ్యి వేసుకుని చెప్పు ఇదిస్వార్థం కాదంటావా? ఆలోచించి మరీ జవాబు చెప్పు .నువ్వు ఇలా తయారవడానికి కారకులు ఎవరు? మీ ఇంటి పరిస్థితులు, పెడదారిన పట్టిన ఆలోచనలు, నిన్ను సకాలంలో సరిదిద్దని నా లాంటి స్నేహితులు. ఈ పాపంలో నాకూ పాలు ఉంది. ఇన్నాళ్ళూ నీకు చెప్పలేక పోయినందుకు సిగ్గుపడుతున్నాను. ఇంకా నిన్ను నువ్వు అర్థం చేసుకునే సమయం మించి పోలేదని ఆశపడుతున్నాను.

తనది అనేది లేని త్యాగ మూర్తులూ, ఎదురు ఏదీ ఆశించక ఉపకారంచేసే ఉదారచిత్తులూ లేరా అని నువ్వు అడగొచ్చు. ఉండొచ్చు. కానీ ఉప్పు పులుసూ తిని తప్పు ఒప్పు చేసే మానవమాత్రులం. ఆమాట నిలుపుకుంటే ఇలా ఎత్తుకి ఎగర బోడమూ తప్పటడుగువేసి బోర్లా పడడమూ ఉండదేమో!భ్రష్టయోగులు అయే బదులు యోగ్యులైన సామాన్యులుగా మనం మిగిలిపోతే నయంకాదంటావా?

నీ త్యాగాన్ని గుర్తించారని నువ్వు అనుకున్న మీ నాన్నగారూ, చిన మేనత్తా నిన్ను వదిలి పెట్టి వెళ్ళి పోయారు. నీ త్యాగాన్ని నన్నయినా గుర్తించమని కోరుకునేదీ, ప్రతిఫలం ఆశించేది త్యాగం కాదుగనుక సాధారణమైన బలహీనతలున్న సామాన్యమైన స్త్రీగానే నేనునిన్ను గుర్తిస్తున్నాను. ఆసంగతి నీకు గుర్తుకు రావడానికే పాత ఉత్తరాల్లో భాగాలు మళ్ళీ మళ్ళీ రాశాను.

ఇంతగా నువ్వు ఆత్మ వంచన చేసుకున్నం దువల్ల యింట్లోనష్టపోయేది నువ్వు ఒక్కర్తివే కాదు. కూడని బాధ్యతని నెత్తిన వేసుకుని తగనిహోదాని నువ్వు స్వీకరించినందువల్ల యింటిల్లి పాదినీ బద్ధకస్తుల్నీ, సోమరిపోతుల్నీ చేశావు. ఈ సారిపరీక్షల్లో మీ యింట్లో ఎవరూ ప్యాసు కాలేదని రాశావు. అంత కీర్తినీ మూటకట్టుకుందామని,అన్ని బాధ్యతల్నీ నెత్తిన వేసుకుని ఏపనీ ఎవరికీ అప్పజెప్పక అందర్నీ పనికిమాలిన వాళ్ళని చేసింది నువ్వుకాదా? ఊరంత

నీడపరచే మర్రి చెట్టుపైకి చల్లగానే కనపడవచ్చు. కాని ఆ చెట్టు ఉన్నంత కాలం దానికింద మరో పచ్చని మొక్క మొలకెత్తడానికి అవకాశం ఉందంటావా?

అంతే కాదు 'ఇంత చేసినా నన్నెవరూ గుర్తించలేదనే' కడివెడు దుఃఖం కడుపులో పెట్టుకున్న దానిని నీ మొహం కళకళ లాడడం అంటూ ఎప్పుడేనా ఉంటుందా? అలాంటి మొహం లేనిదానికి పదిమంది పిల్లలికి పాఠం చెప్పే అర్హత ఎప్పుడైనా ఎక్కడైనా ఉంటుందంటావా?

ఇన్ని ఉత్తరాలు నాకు రాశావు ఎప్పుడూ నీ గురించే చెప్పుకున్నావుగాని- ఒక్కసారైనా నీమొగుడూ పిల్లాడూ ఎలా ఉన్నారు?' అని రాశావా? నీ ఉత్తరం వచ్చినప్పుడల్లా నాకుమతి పోయేది. రెండ్రోజులపాటు పిచ్చెత్తినట్టు అయిపోయే దాన్ని. నీ ప్రాణ స్నేహితురాల్ని నాకు నువ్వు వంచిపెట్ట వలసింది. దుఃఖం ఒకటేనా?

నా ప్రియాతి ప్రియమైన జానకీ! మనసు ఎంతో కట్టుదిట్టం చేసుకుని యిన్ని కఠినమైన మాటలు రాశాను నీ మేలు కోరిన నేను యికనైనా నీకు నిజం చెప్పక తప్పదు. నిజం నిప్పులా వుండడం తప్ప మరో రూపం లేదు మరి, ఏంచెయ్యను!

ఇంకా ఇంకా నువ్వు అక్కడే అదే స్వర్గమనుకుని అంటిపెట్టుకుని ఉంటే పనీ పాటాలేని వాళ్ళతో మీ కొంప నిండిపోవచ్చు మీ బావ వంట్లో బాగాలేదని రాశావు ఆమధ్య. వైద్యానికని ఆ కుటుంబం మీ ఇల్లు చేరవచ్చు. మీ పెద్దచెల్లి పురిటికి ఎలాగా వస్తుందని రాశావు.వచ్చిన ఆరు నెలల దాకా మీ అమ్మగారు ఆమెను వదలక పోవచ్చు. చేసే వాళ్ళున్నప్పుడుచేయించుకునేవాళ్ళదా తప్పు?


మీ పెద్దచెల్లిని చేసుకున్నాడే అతను మీ ఇంటికి వచ్చినప్పటి సందర్భంలో అంతగా డబ్బు మొహం చూసుకున్నవాడు మనిషిలా అనిపించుకుంటాడు? అని నాకు రాశావు. అతను నీ జీవితాన్ని వరించినమాట నిజమే. అదితప్పే.మీరు నేను సంపాదిస్తే అంతకష్టమనిపించదు' అని ఆయన అంటుంటే వేరే స్వర్గం లేదనిపించిందని రాశావు.

అంటే దాని అర్థం ఏమిటి? అతని సంపాదనమీద నువ్వు కన్ను వెయ్యలేదా? అతని సాహచర్యం కోరడంలో నీస్వార్థం నీకు లేదంటావా? నీ బాధ్యతలగురించేగాని అతని బాధ్యతల గురించి ఒక్కమారైనా ఆలోచించావా.?

మనస్సుకి తృప్తిలేని మానవమాత్రుడు మానసిక భ్ర మలోపడి,ఎవరికో కాదు- తనకితనే- ఎంత అపకారం చేసుకుంటాడో రుజువు చెయ్యడం యిప్పటికైనా నువ్వు మానుకో , నీకూమీఇంట్లోవాళ్ళకీ గాలీ వెలుతురూ చూపించాలంటే నువ్వు అక్కణ్నుంచి ఎంత త్వరగా తప్పుకుంటే అంత మంచిది.

వీలయినంత తొందరలో ఎవర్నైనా పెళ్ళి చేసుకో .ముందును వ్వు సుఖపడు.తృప్తిపడు.తర్వాత ఎవరిసంగతైనా ఆలోచించవచ్చు. నీకు పెళ్ళి వయసు దాటిపోయిందంటే నేను నమ్మను. లేదా మరొక పద్ధతుంది. పెళ్ళయిన వాళ్ళందరూ బాగుపడనూ లేదు, లేచి పోయిన వాళ్ళంతా చెడిపోనూలేదు! ఏమంటావ్?

-సావిత్రి




మే 19, 2009న మచిలీపట్నం, ఆంధ్ర సారస్వత సమితి ఉగాది సాహిత్య ప్రతిభా పురస్కార ప్రధానోత్సవ సభలో డా॥ కె.వి. కృష్ణకుమారి, రేణుక, కొట్టి విమలారావు, సమితి అధ్యక్షులు డా॥ ఎం.కె. దుర్గాప్రసాద్, వి.సి. కృష్ణా యూనివర్శిటీ, జి. సనారా, తిక్కన సోమయాజి, డా॥ ఎం. సత్యనారాయణ, వడలి రాధాకృష్ణ, అర్జున గౌడ్ మొదలగువారున్నారు. 23 సాహిత్య ప్రక్రియలలో పద్య, వచన కవితలు, నానీలు, సాహిత్య విమర్శ, బాల సాహిత్యం, దేశభక్తి సాహిత్యం, సంగీతం, నృత్యం, ప్రముఖ విద్యావేత్త... లకు పురస్కార ప్రదానం జరిగింది.


సమస్యల్లో ఉన్న స్త్రీల కోసం

భూమిక హెల్ప్‌లైన్

(కేవలం ఫోన్ ద్వారానే)



సలహా, సమాచారం కోసం సంప్రదించండి

టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2908

(మీ వివరాలను గోప్యంగా వుంచడం మా బాధ్యత)

Our cause is supported by OXFAM